# రెండు కేంద్రాలకు ఆయానే దిక్కు

- ఒకరు ఉద్యోగ విరమణ, మరొకరు సెలవులో
- బందన్‌కల్‌లోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఇబ్బంది



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న ఆయా

ముస్తాబాద్‌: మండలంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజుల తరబడి ఆయమ్మనే చిన్నారులను చూసుకుంటోంది. మండలంలోని బందనకల్ జెడ్పీ పాఠశాల ఆవరణలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలుండగా ఏడాది క్రితం ఒక అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన టీచర్ భారతమ్మ, ఆయా ఒకేసారి ఉద్యోగ విరమణ పొందారు. దీంతో రెండో కేంద్రం టీచర్ భారతమ్మ, ఆయాలే రెండు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. అయితే కొద్ది రోజుల క్రితం టీచర్ కూడా సెలవుపై వెళ్లారు. దీంతో ఇప్పుడు రెండు కేంద్రాలను ఆయానే చూస్తున్నారు.

**చిన్నారుల ఇబ్బంది**

రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఆయమ్మనే నిర్వహిస్తుండడంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందిపడుతున్నారు. చాలారోజులుగా రెండు కేంద్రాల నిర్వహణ ఆమెకు ఇబ్బందిగా మారిందని గ్రామస్తులు తెలిపారు. ఒక కేంద్రం టీచర్, ఆ యా ఇద్దరు ఒకేసారి రిటైర్ కావడం, మరో అంగన్‌వాడీ టీచర్ సెలవుపై వెళ్లడంతో ఆయాపైనే మొత్తం భారం పడుతోందని పేర్కొంటున్నారు. రెండుకేంద్రాల్లో 25 మంది చిన్నారులు ఉండగా, ప దిమంది కూడా రావడం లేదని తెలిపారు. దీంతో పాటు రెండుకేంద్రాల పరిధిలోని బాలింతలు, గ ర్భిణులకు ఆరోగ్యలక్ష్మీ పథకం ద్వారా అందే పోషకాహారం తయారు చేయడం, పిల్లలను చూసుకో వడం ఆయమ్మకు భారంగా మారినట్లు పేర్కొన్నారు.

### టీచర్, ఆయాను నియమించాలి



రెండు కేంద్రాల్లో ఒకే ఆయా పనిచేయడంతో పిల్లలు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. ఒక టీచర్ రిటైర్ కాగా, మరొకరు సెలవులో ఉన్నారని అధికారులకు తెలిపాం. కేంద్రాలకు పిల్లలు రావడం తగ్గిపోయింది. వెంటనే ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయాలి.

– కొరెడ్ల రమేశ్‌రెడ్డి, బందనకల్

### కేంద్రాల బాధ్యతలు అప్పగిస్తాం



బందనకల్ రెండు కేంద్రాల్లో పిల్లలు, లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిసింది. మరో టీచర్‌కు మూడురోజుల్లో బాధ్యతలు అప్పగిస్తాం. బందనకల్ ఇంకో సెంటర్‌ను ఇక్కడికే తరలించి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతాం. అందరికీ పోషకాహారం అందేలా చూస్తాం.

– ఉమారాణి, సీడీపీవో

## క్లుప్తంగా

### 8న కలెక్టరేట్‌కు తరలిరావాలి



సిరిసిల్ల అర్బన్ : ఈనెల 8న కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఆవునూరి ప్రభాకర్ కోరారు. గురువారం పట్టణ పరిధిలోని 22వ వార్డు పెద్ద బోనాలలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, బీహెచ్‌పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు వికలాంగులు, బీడీ కార్మికులు, వితంతువులు, గీత, నేత కార్మికులకు ఇస్తానన్న పెన్షన్ పెంపును కోరుతూ కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బిక్షపతి, టౌన్ అధ్యక్షుడు బడుగు లింగయ్య, నాయకులు బాలయ్య, శోభరాణి, సామ్యూల్, పర్శరాములు, తదితరులు పాల్గొన్నారు.

### సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్ల అర్బన్ : గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌హెచ్‌పీ ఆరిప్ అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో వైద్యశిబిరం నిర్వహించారు. 103 మందికి స్క్రీనింగ్, రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఏఎన్‌ఎంలు గంగాదేవి, సంతోషి, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

**దాచారంలో..**

ఇల్లంతకుంట: మండలంలోని దాచారంపల్లె దవాఖానలో గురువారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రేమ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఏఎన్‌ఎంలు, హెచ్‌ఈఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు

### రూ.55 వేలు అందజేత



ఇల్లంతకుంట: మండలంలోని పెద్ద లింగాపూర్ గ్రామానికి చెందిన కేతిరెడ్డి నవీన్ రెడ్డి గ్రామంలో ఏర్పాటుచేసిన వినాయక మండపాల నిర్వాహకులకు పూజా ఖర్చుల నిమిత్తం రూ.55 వేలు గురువారం అందజేశారు. మండపాల వద్ద పూజాకార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మండపాల నిర్వాహకులు తదితరులున్నారు.

### టీబీ నిర్ధారణ పరీక్షలు

ఎల్లారెడ్డిపేట: మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం టీబీ ముక్త్‌భారత్ అభియాన్ నిర్వహించారు. వైద్యాధికారి సారియా అంజుమ్, పీహెచ్‌సీ టీబీ సూపర్‌వైజర్ మహిపాల్ మాట్లాడుతూ షుగర్, క్యాన్సర్, బీపీ, దీర్ఘకాలిక వ్యాధులు, పొగాకు తీసుకునే వారిలో క్షయవ్యాధికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఆకలి లేకపోవడం, రాత్రిపూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే తెమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. 146 మందికి టీబీ స్క్రీనింగ్ చేశారు. 15 మంది అనుమానితులను మెడికల్ కాలేజీకి రెఫర్ చేసినట్లు తెలిపారు.

### నిధులు మంజూరు

వేములవాడ: వేములవాడ నియోజకవర్గంలోని కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు రూ.1.35 కోట్లు, చందుర్తి కేజీబీవీకి రూ.58 లక్షలు, కోనరావుపేట రూ.56 లక్షలు, రుద్రంగి రూ.8లక్షలు, వేములవాడరూరల్ రూ.8లక్షలు, వేములవాడ అర్బన్ రూ.5లక్షలు, సర్వశిక్షా నిధుల నుంచి రుద్రంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ. 36.90 లక్షలు, వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ. 24.15 లక్షలు, కోనరావుపేట రూ.19లక్షలు, చందుర్తి రూ.18.47 లక్షలు మొత్తం రూ. 96.62 లక్షల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఈ నిధులతో ఆయా కళాశాలలు, పాఠశాలలో భవన మరమ్మతులు, విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం పనులకు వెచ్చించనున్నట్లు తెలిపారు.

### బస్సు కోసం విద్యార్థుల ఆందోళన

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో బస్సు కోసం విద్యార్థులు ఆందోళన చేపట్టారు. వేములవాడ నుంచి కోనరావుపేటకు మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలకు వెళ్లే విద్యార్థులు బస్సులో వెళ్తుంటారు. కనగర్తి మీదుగా కోనరావుపేటకు వెళ్తున్న బస్సు అంబేడ్కర్ విగ్రహం వద్దకు కొన్ని రోజులుగా రావడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. గురువారం బస్సు ముందు ఆందోళన చేపట్టారు. కొన్నేళ్లుగా అంబేద్కర్ విగ్రహం వద్దకు బస్సు రావడంతో విద్యార్థులకు సౌకర్యంగా ఉండేదని, కొన్ని రోజులుగా రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. ఏఎస్సై లక్ష్మణ్ చేరుకుని ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. శుక్రవారం నుంచి యథావిధిగా వచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# ఘనంగా టీచర్స్ డే వేడుకలు



ముస్తాబాద్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో



ఎల్లారెడ్డిపేట కళాశాలలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు




వేములవాడరూరల్: ఉపాధ్యాయులకు సన్మానం

సిరిసిల్ల ఎడ్యుకేషన్/వేములాడ అర్బన్/ వేములవాడరూరల్/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట: జిల్లాలోని పలు పాఠశాలల్లో గురువారం టీచర్స్ డే వేడుకలు నిర్వహించారు. వేములవాడలోని సైకి స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో కరస్పాండెంట్ ఆసరి మహేశ్ కేక్ కట్ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. సిరిసిల్ల పట్టణం నెహ్రూ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో టీచర్స్ డే సందర్భంగా చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వేములవాడ పట్టణం న్యూఅర్బన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు. ముస్తాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ముందస్తు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంనిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హన్మాజిపేట జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను గ్రామస్తులు, విద్యా కమిటీ సభ్యులు సత్కరించారు. ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో టీచర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ పద్మావతి, గ్రాడ్యుయేట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిలుముల జయవర్ధన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గంగాధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అర్హులకు కార్డులు ఇవ్వాలి



మాట్లాడుతున్న కదారి రాములు

సిరిసిల్లటౌన్: అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు కోరారు. సిరిసిల్లలోని కార్మికభవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ రంగంలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు చనిపోతే రూ.10లక్షలు, సహజ మరణానికి రూ.2లక్షలుగా జీవోను విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. 55 ఏళ్లు నిండిన కార్మికులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. కార్మిక నాయకులు అజ్జ వేణు, గాజుల పోశెట్టి, పండుగ పోచమల్లు, గుమ్మడవెల్లి మంజుల పాల్గొన్నారు.

### ఓనమ్ వేడుకలు



ఓనమ్ వేడుకలు నిర్వహించారు.

వేములవాడ: మలయాళీలతో పాటు స్థానికులు వేములవాడలో ఓనమ్ పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లని చీరలలో మహిళల సందడి చేశారు. చిన్నారులకు ఓనం ప్రాధాన్యం వివరించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో



వేములవాడఅర్బన్: నాంపల్లిలో గణేశ్ శోభాయాత్ర



గంభీరావుపేట: మట్టి వినాయకులను నిమజ్జనానికి తరలిస్తున్న అధ్యాపకులు



వేములవాడఅర్బన్: ఆరెపల్లి వద్ద మిడ్ మానేరులో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న కుటుంబ సభ్యులు



బోయినపల్లి: గుండన్నపల్లిలో శోభాయాత్ర

### ఘనంగా వినాయక నిమజ్జనం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని పలు గ్రామాల్లో గణేశ్ నిమజ్జనాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన వాహనాల్లో గణనాథుడిని ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు.

ఇల్లంతకుంట: పెద్దలింగాపూర్‌లోని నాల్గోవార్డు గణేశ్ ఉత్సవ కమిటీ మండపంలో లడ్డూకు గురువారం వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన అరుకూలి అనిల్ రూ.39వేలకు దక్కించుకున్నాడు. అనంతరం గ్రామంలోని 9 వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం నిర్వహించారు.

గంభీరావుపేట: గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నెలకొల్పిన వినాయకుడి నిమజ్జనం నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు ఊరేగింపుగా మట్టి వినాయకులను సమీప చెరువులోకి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

బోయినపల్లి: కొత్తపేట, మల్లాపూర్, వరదవెల్లి, గుండన్నపల్లి గ్రామాల్లో వినాయక నిమజ్జన శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం చెరువు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

### కేటీఆర్‌ను కలిసిన సింగిల్‌విండో చైర్మన్



కేటీఆర్‌తో బండి దేవదాస్ కుటుంబ సభ్యులు

తంగళ్లపల్లి: సిరిసిల్ల సింగిల్‌విండో చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బండి దేవదాస్ గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కుటుంబ సమేతంగా కలిశారు. మండలంలో రైతుల పరిస్థితులపై కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన కేటీఆర్ రైతులకు ఎలాంటి కష్టాలు రాకుండా పార్టీ తరఫున పోరాడాలని సూచించినట్లు తెలిపారు.

### బీమా చెక్కు అందజేత



బీమా చెక్కును అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

చందుర్తి: కేడీసీసీ బ్యాంకు ద్వారా అందజేస్తున్న బీమా సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్.నర్సింహారెడ్డి కోరారు. మండలంలోని రామరావుపల్లెకు చెందిన గుడిసె రమేశ్ అనే ఖాతాదారుడు బ్యాంకు ద్వారా అందజేస్తున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన పథకం కింద రూ.436లతో బీమా సొమ్మును చెల్లించుకోగా , గతేడాది నవంబర్ 20న వేములవాడ అర్బన్ పరిధిలో శాత్రాజుపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి భార్య గౌతమికి రూ.2లక్షల డిపాజిట్ చెక్కును గురువారం అందజేశారు. మరో బీమా ప్రధానమంత్రి సురక్ష యోజన పథకం కింద రూ. 2లక్షల డిపాజిట్ చెక్కులను త్వరలోనే అందిస్తామని అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నర్సింహారెడ్డి తెలిపారు. కేడీసీసీ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ జి.అజయ్ కుమార్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

### మృత్యువుతో పోరాడి ఓడిన యువకుడు

- లక్షలు వెచ్చించిన దక్కని ప్రాణం
- క్యాన్సర్‌తో మృతి.. నారాయణపూర్‌లో విషాదం



కుమార్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట: క్యాన్సర్‌తో పోరాడిన ఓ యువకుడు చివరకు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన మండలంలోని నారాయణపూర్‌లో విషాదం నింపింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన భారతం కుమార్ (36) రూ.3 లక్షలు అప్పులు చేసి గల్ఫ్‌కు వెళ్లాడు. అక్కడ కంపెనీలో పనిచేస్తున్న క్రమంలో తలనొప్పితో స్పృహ తప్పి కుప్పకూలాడు. దుబాయిలో సరైన వైద్యం అందక, ఆర్థికస్థోమత లేకపోవడంతో కంపెనీ నాలుగు నెలల క్రితం స్వగ్రామం పంపించారు. ఇక్కడ అన్ని పరీక్షలు చేయగా బ్రెయిన్ క్యాన్సర్ అని వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు, దాతల సాయంతో హైదరాబాద్‌లోని బసవతారకం ఆస్పత్రిలో వైద్యం అందించారు. రూ. 7లక్షలు ఖర్చుచేసి శస్త్ర చికిత్స అందించారు. ఇటీవలే ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చిన కుమార్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య భారతి ఉంది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కుంకుమపూజలు.. నైవేద్యాలు



ఇల్లంతకుంట: గంగాధర క్షేత్ర ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



గంభీరావుపేట: 108 రకాల నైవేద్యాలు సమర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు



సిరిసిల్ల టౌన్: జ్యోతినగర్‌లో వినాయక పూజల్లో పాల్గొన్న భక్తులు



రుద్రంగిలో వినాయక మండపం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

సిరిసిల్ల టౌన్/సిరిసిల్ల అర్బన్/కోనరావుపేట/తంగళ్లపల్లి/ రుద్రంగి/ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట/చందుర్తి/ ఇల్లంతకుంట/వీర్నపల్లి: గణేశ్ నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మండపాల్లో గురువారం వినాయక నిత్యపూజలతో పాటు ప్రత్యేక పూజలు జరిపారు. జ్యోతినగర్‌లో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్, పెద్దబజార్ స్వర్ణకారం సంఘం, రజక సంఘం తదితర సంఘాల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. భావనరుషినగర్‌లో రజకసంఘం, బీవై నగర్, పాతబస్టాండు తదితర ప్రాంతాల్లో మహాన్నదానం నిర్వహించారు. పట్టణంలోని 23వ వార్డు అంబికానగర్‌లో ఆదర్శ యూత్ సిద్ది మండప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు, అన్నదానం నిర్వహించారు. గంభీరావుపేట మండలకేంద్రంలోని అచ్చయ్యస్వామి దేవస్థానంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గణనాథుడికి 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. కోనరావుపేట మండలం కొలనూర్, మర్తనపేట, ధర్మారం, కనగర్తిలో అన్నదానం, కుంకుమ పూజలు నిర్వహించారు. రుద్రంగి మండలకేంద్రంలో వినాయక మండపం వద్ద ప్రత్యేకపూజలు చేశారు. మహన్నదానం చేశారు. ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో పలు మండపాల్లో వినాయకుల వద్ద బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, మాజీ జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, నాయకులు పూజలు చేశారు. తంగళ్లపల్లి మండలకేంద్రంలోని మార్కెండేయ భవనంలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. ఎస్సై ఉపేంద్ర చారి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, తదితరులు పాల్గొన్నారు. చందుర్తి మండలం బండపల్లి శ్రీ వేంకటేశ్వర యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని మండపం వద్ద మహిళలు ఒకరికొకరు పసుపు, కుంకుమ పంపిణీ చేసిన గాజులు వేసుకుని గాజుల పండుగను ఇల్లంతకుంట మండలకేంద్రంలోని గంగాధర క్షేత్ర ఆలయంలోని గణనాథుడి వద్ద సామూహిక కుంకుమపూజలు చేశారు. వంద మంది మహిళలు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకుడు నాగరాజు శర్మ పూజా కార్యక్రమానంతరం అన్నదానం చేశారు. వీర్నపల్లి మండలకేంద్రంలో వినాయక ఉత్సవ కమిటీ సుభాష్‌నగర్ ఆధ్వర్యంలో కుంకుమపూజ, అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న గోపాల్‌రావు

ముస్తాబాద్‌: ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కల్వకుంట్ల గోపాల్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలన్నారు. యూరియా కోసం రైతులు ఇబ్బంది ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా రైతులకు సరిపడా యూరియా అందించాలన్నారు. సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, స్వామి, అన్వర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**● విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి**

సిరిసిల్ల అర్బన్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్ఎస్సై కె.తిరుపతి సూచించారు. సర్దాపూర్‌లోని 17వ బెటాలియన్‌కు చెందిన'ఏ' కంపెనీ అధికారులు, సిబ్బంది యాన్యువల్ రీఫ్రెష్ కోర్స్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా విద్యాసామగ్రిని పంపిణీ చేశారు.

**● మూడు రోజులు మద్యం బంద్**

వేములవాడరూరల్: వేములవాడ మండలంలో మూడు రోజుల పాటు మద్యం దుకాణాలు బంద్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ రాజశేఖర్‌రావు తెలిపారు. సెప్టెంబర్ 4, 5, 6 తేదీల్లో మద్యం దుకాణాలు బంద్ పాటిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్సైజ్ పోలీసులు వైన్ షాపులకు తాళాలు వేశారు. రూరల్ మండలంలోని చాలా గ్రామాల్లో ముందుగానే బ్రాందీ షాపులు బంద్ ఉంటాయని సమాచారం తెలుసుకున్న బెల్ట్‌షాపుల నిర్వాహకులు భారీగా మద్యం నిల్వచేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

**● సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం**

కోనరావుపేట: సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం లాంటిదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు రూ.10.22 లక్షల విలువైన చెక్కులను గురువారం పంపిణీ చేశారు. తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో శంకర్‌రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**● చికెన్ సెంటర్‌లో దొంగతనం**

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన సల్వాజీ వెంకట్ నిర్వహిస్తున్న చికెన్ సెంటర్‌లో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామంలోని బస్టాండ్ వద్ద చికెన్ సెంటర్‌కు వెంకట్ బుధవారం రాత్రి తాళం వేసి ఇంటికెళ్లాడు. మరుసటి రోజు ఉదయం చికెన్ సెంటర్‌కు వెళ్లి చూడగా, షాపుకు వేసిన తాళం పగులగొట్టి ఉంది. అందులోని ఉపయోగించే నాలుగు కత్తులు, రూ. 2వేల నగదు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వెంకట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపారు.

**● స్కావెంజర్లకు వేతనాలను చెల్లించాలి**

చందుర్తి: జిల్లాలోని స్కావెంజర్లకు గతేడాది వేతనాలను వెంటనే విడుదల చేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి రేవోజు సదానందం డిమాండ్ చేశారు. మండలంలోని మూడపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ మండల ఎన్నికలు నిర్వహించి, సభ్యత్వాల నమోదును గురువారం చేపట్టారు. సమావేశంలో మండలశాఖ అధ్యక్షుడు జావీద్, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌సాగర్‌రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులతో పాటు మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

**● నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి**

రుద్రంగి: గణేశ్ నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై శ్రీనివాస్ సూచించారు. గురువారం రుద్రంగి పోలీస్‌స్టేషన్లో గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఏఎస్ఐ, పోలీసు సిబ్బంది, మండలంలోని గణేశ్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

**● రైతులకు యూరియా అందించాలి**

వీర్నపల్లి: రైతులకు సరిపడా యూరియాను అందించాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ అన్నారు. గర్జనపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అటవీ గ్రామాలకు సరైన రవాణా వ్యవస్థ లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతుకు ఒక్కోబస్తా చొప్పున యూరియా అందించడం సరిపోవడంలేదన్నారు. బీఎస్పీ నియోజకవర్గ కార్యదర్శి కొమురయ్య, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

**● పాఠశాల పరిసరాలు శుభ్రం**

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయ పరిసరాలను గురువారం అధికారులు యంత్రాల సాయంతో పరిశుభ్రం చేశారు. దీంతో పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా మారింది.

**● ఇద్దరిపై కేసు**

వీర్నపల్లి: మండలంలోని కంచర్లలో అసిస్టెంట్ హెల్పర్ శ్రీహరిపై బుధవారం దాడిచేసిన దూది రాజయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వేముల లక్ష్మణ్ తెలిపారు. బాధితుడు శ్రీహరి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు. అలాగే మండలంలోని శాంతినగర్‌కు చెందిన మాలోత్ తిరుపతి ఎలాంటి కారణం లేకుండా ప్రతీసారి డయల్ 100కు కాల్ చేసి విధులకు ఆటంకం కల్గిస్తున్నాడని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

**పంటల నమోదు చేసుకోవాలి**

వేములవాడరూరల్: రైతులు పంటల నమోదు చేసుకోవాలని వేములవాడ రూరల్ మండల వ్యవసాయ అధికారి వినీత అన్నారు. రైతులు తమ క్లస్టర్ పరిధిలోని ఏఈవోల వద్దకు వెళ్లి ఖరీఫ్‌లో వేసిన పంటల వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.